ఆరోగ్యం చల్లకుండ

- మట్టి కుండలకు పెరిగిన ఆదరణ
- పేదల నుంచి ధనికుల వరకు కొనుగోలుకు మొగ్గు

ధవళేశ్వరం: వేసవి తాపం ప్రారంభమైంది. మార్చి రెండో వారంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో మంచినీరు తాగేందుకు అధిక శాతం మంది మట్టి కుండల వైపు మొగ్గుతున్నారు. గతంలో ఫ్రిడ్జిలకు అధిక డిమాండ్ ఉండటంతో కొంత కాలం మట్టి కుండలకు డిమాండ్ తగ్గింది. ఇటీవల కాలంలో ప్రజలు ఆరోగ్యకర జీవనశైలికి ఎక్కువ మొగ్గు చూపుతుండటంతో మట్టి కుండలకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. ప్రతి ఇంట్లో ఫ్రిడ్జిలకు ఉన్నప్పటికీ ఒక కుండ ఏర్పాటు చేసుకుంటున్నారు. వేసవిలో దాహార్తి నుంచి ఉపశమనం కలగడంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ప్రజలు నమ్ముతున్నారు.

వివిధ రకాల డిజైన్లలో..

ట్రెండ్‌కు తగినట్టు వివిధ రకాల ఆకారాల్లో కుండలను, కూజాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. కొందరు వీటికి డిజైన్లను వేసి విక్రయిస్తుండటంతో అధిక శాతం మంది వీటి కొనుగోలుకు మొగ్గుతున్నారు. మట్టి కుండలకు దిగువన ట్యాప్‌లు కూడా పెట్టి విక్రయిస్తుండటంతో ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉంది. మట్టి కుండలతో పాటు మట్టి వాటర్ బాటిళ్ల అమ్మకాలు కూడా బాగా పెరిగాయి.

మట్టి కుండలతో ఆరోగ్యం

మట్టి కుండల్లో నీటిని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రజల అభిరుచి మేరకు తయారీదారులు కూడా నూతన పంథాను అనుసరిస్తున్నారు. గతంలో సాధారణ కుండలు, కూజాలను విక్రయించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి ట్రెండ్‌కు తగ్గట్టు మట్టి కుండలను వివిధ రంగుల్లో అలంకరించి విక్రయాలు సాగిస్తున్నారు. సాధారణ కుండలు పేదలకు అందుబాటు ధరల్లో లభిస్తుండగా డిజైన్లతో కూడిన కుండల రేటు కొంత అధికంగా ఉంటోంది. మట్టి కుండను సైజును బట్టి రూ.200 నుంచి రూ. 700 వరకు అమ్ముతున్నారు. వేసవిలో చిన్నపిల్లలకు సైతం మట్టి కుండలలోని నీటిని ఇవ్వడం ద్వారా అనారోగ్యాల నుంచి కాపాడవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలు తీవ్ర రూపం దాలుస్తుండటంతో మట్టి కుండల విక్రయాలు పెరిగి వ్యాపారుల్లో జోష్ నెలకొంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మట్టి కుండలు



మట్టి వాటర్ బాటిల్

ప్రజల ఆసక్తి



మట్టి కుండలు, మట్టి వాటర్ బాటిళ్ల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కార్లలో సైతం వచ్చి కుండలను కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. నీరు తాగడానికి వీలుండేలా కుండలకు ట్యాప్‌లు అమర్చి విక్రయిస్తున్నాం.

– ఉదుము వెంకట్రావు, కుండల తయారీదారుడు, ధవళేశ్వరం

పెరిగిన విక్రయాలు



ఎండలు పెరగడంతో ఈ వారంలో కుండల అమ్మకాలు పెరిగాయి. డిమాండ్‌కు తగినట్టుగా వీటిని తయారు చేస్తున్నాం. పేదలు సాధారణ కుండలకు, మిగిలిన వారు డిజైన్ల కుండలను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. అలాగే మట్టి వాటర్ బాటిళ్ల అమ్మకాలు బాగున్నాయి.

– శ్రీను, కుండల తయారీదారుడు, ధవళేశ్వరం

క్లుప్తంగా

పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర



పోలీసు స్టేషన్‌ను శుభ్రం చేస్తున్న అధికారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, వాటి ఆవరణల్లో శనివారం శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల లోపలి భాగంతో పాటు చుట్టుపక్కల ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.

18న ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవం



ఒనువులమ్మ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని ఒనువులమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 18న వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు తీసుకువచ్చిన జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు, శత సహస్ర నామ పుష్పార్చన, చివరగా అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు




తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య అన్నారు. రైల్వే స్టేషన్‌లో పలు విభాగాలు, ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాలుతో పాటు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో శనివారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేశారు. మాదక ద్రవ్యాలను గుర్తించే శిక్షణ పొందిన బెల్జియం మెలోనిస్ డాగ్‌తో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్‌ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం నగరంలో డీసీసీ కార్యాలయంలో నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం మాటలు బాగున్నాయి గానీ, చేతలు మాత్రం శూన్యమన్నారు. అనంతరం పలు మండలాల అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఘనంగా కాన్షీరామ్ జయంత్యుత్సవం



దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న విజయకుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అంబేద్కర్ ఆశయాల సాధనకు మహానేత కాన్షీరామ్ కృషి చేశారని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ కొనియాడారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 91వ జయంతిని శనివారం స్థానిక ఐటీసీఎల్‌లోని పలుకు స్వచ్ఛంద సేవాసంస్థ దివ్యాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు , స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి బాబ్జి మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కోసం కృషి చేసిన కాన్షీరామ్ ఉత్తరప్రదేశ్ లో అధికారం వచ్చేలా చేసి చూపించారని కొనియాడారు. బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.అనంతరం క్వారీ ప్రాంతంలోని కాన్షీరామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధవళేశ్వరంలో చోరీ

ధవళేశ్వరం: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, వెండి వస్తువులు, 40 అంగుళాల టీవీని దొంగిలించారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపేట వాటర్ ట్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న చొప్పర హరీష్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి గురువారం ఊరు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఇంటికి రాగా గెడ పెకలించి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూశారు. 40 అంగుళాల టీవీ, బీరువాలో నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గణేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ కూడా ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది.

23 నుంచి సీపీఐ రాజకీయ ప్రచార జాతా

ప్రకాశం నగర్: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి నుంచి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకూ 20 రోజుల పాటు (మార్చి 23 నుంచి ఏప్రిల్ 14) సీపీఐ రాజకీయ ప్రచార జాతా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రను నాటకాల ద్వారా ప్రదర్శిస్తామన్నారు. నగరంలోని ప్రధాన సెంటర్లలో బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.లావణ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ ఫెస్ట్



సైన్స్‌ఫెస్ట్‌ను తిలకిస్తున్న రవీంద్ర తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు బాలాజీపేటలోని ఏఎల్ఎస్ బ్లాసోమ్స్ స్కూల్లో శనివారం సైన్స్ ఫెస్ట్ జరిగింది. ఆ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఏఎస్ రవీంద్ర, ప్రిన్సిపాల్ రష్మిత, వైస్ ప్రిన్సిపాల్ గుత్తుల వరలక్ష్మి పర్యవేక్షించారు. స్కూల్ అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి



కడియంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

కడియం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని, తద్వారా బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని ఎల్ఎఫ్‌జేసీ వెల్ఫేర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఆచార్య ఉదయ్ కిరణ్ అన్నారు. స్థానిక హైస్కూల్లో నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 168 మంది విద్యార్థులకు శనివారం పరీక్ష అట్ట, పెన్ను, పెన్సిల్, స్కేల్, స్వీట్స్ అందించి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ హాజరయ్యారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఎస్.రాబర్ట్, అరుణ ఫిలిప్, విజయగ్రేస్, అనిల్, సాల్మన్, సూర్య, శ్రీనివాస్, అయ్యప్ప పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్‌వో నాగాంజనేయులు

రాజమహేంద్రవరం రూరల్: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా పౌర సరఫరాల అధికారి (ఎఫ్ఏసీ) ఎం.నాగాంజనేయులు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ వస్తు నాణ్యత, ప్రమాణాలపై ప్రశ్నించే విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లాలో పాఠశాలలు, కాలేజీలు, రైతు బజార్లు తదితర ప్రదేశాలలో వినియోగదారుల హక్కులపై వినియోగదారుల సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి, మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల కమిషన్లలో ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, జిల్లా యంత్రాంగం, వినియోగదారుల ఫోరం సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారులు హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కె.శామ్యూల్ రాజు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య, జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ వి.వెంకట రాజు, నిడదవోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రుద్ర, వైద్య శాఖ డెమో ఎస్.సత్యకుమార్, ఏపీఎస్ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా గోపాలన్ గాత్రం



గాత్ర కచేరీ చేస్తున్న మధురై కృష్ణ శేషగోపాలన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చెన్నైకు చెందిన ప్రముఖ గాయకుడు మధురై కృష్ణ శేష గోపాలన్ గాత్రం శ్రోతలను అలరించింది. త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి 74వ వార్షికోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన గోపాలన్ గాత్ర కచేరికి కొమాండూరి వెంకటకృష్ణ వయొలిన్, కమలాకర యోగేష్ మృదంగం, సరస్వతి హనుమంతరావు ఘటం సహకారాలను అందించారు. సమితి గౌరవ అధ్యక్షుడు వాడ్రేవు వెంకట రమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వక్కలంక రామచంద్రం, కార్యనిర్వాహక కార్యదర్శి వి.భాస్కర రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు కళాకారులను సత్కరించారు.

నేడు స్మితా మాధవ్ గాత్రం

హైదరాబాద్‌కు చెందిన స్మితా మాధవ్ గాత్ర కచేరీ ఆదివారం జరగనుంది. దుర్గా భవాని వయొలిన్, జయ భాస్కర్ మృదంగం, సరస్వతుల హనుమంతరావు ఘటం సహకారాలను అందిస్తారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం



విరాటపర్వంపై ప్రవచనం చెబుతున్న రామమూర్తి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణాన్ని ఆనుకుని ఉన్న శివరామకృష్ణ మారుతీ స్వరూప సమర్థ సద్గురు సాయినాథ శ్రీ షిర్డీ సాయి మందిర 13వ వార్షికోత్సవాలు శనివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు నిర్వహణలో మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. మైలవరపు నారాయణ (ద్రాక్షారామం) బ్రహ్మత్వంలో, దెందులూరి శ్యామ్ కుమార్ అర్చకత్వంలో విశేష కార్యక్రమాలు జరుగుతాయి. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా కైకరానికి చెందిన జటావల్లభుల రామమూర్తి మహాభారతంలోని విరాటపర్వంపై ప్రవచనం చేశారు. అనంతరం గుంటూరుకు చెందిన సంగీత విద్వన్మణి, ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్ ద్రోణంరాజు వెంకటరమణ సీత శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ ఆద్యంతం అలరించింది.

బీవీబీకే రెడ్డి సేవలు అందరికీ మార్గదర్శకం



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు, రైల్వే అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధత, ముక్కుసూటితనంతో భారతీయ రైల్వేలో 38 ఏళ్ల పాటు వివిధ విభాగాల్లో సేవలందించి, స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన చీఫ్ క్రూ కంట్రోలర్ బైరెడ్డి వెంకట బృందావన కృష్ణారెడ్డి సేవలు పలువురికి మార్గదర్శకమని రైల్వే అధికారులు కొనియాడారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ సీసీసీగా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛంద విరమణ చేసిన ఆయనకు శనివారం సీసీసీ కార్యాలయంలో రైల్వే శాఖ అధికారులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కృష్ణారెడ్డి తన సర్వీసులో అనేక మంది అధికారుల ప్రశంసలు పొందారన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేశారన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైల్వే శాఖలో ఆపరేటింగ్ విభాగంలో విధి నిర్వహణలో సహకరించిన లోకో పైలెట్లు, కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ క్రూ కంట్రోలర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. శ్రీనివాస్ విశ్రాంత లోగో ఇన్‌స్పెక్టర్లు, లోకో పైలెట్లు, కార్యాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పిల్లల విజయం



మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

కంబాలచెరువు: పిల్లల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం అత్యంత అవసరమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. స్థానిక సాంబశివారెడ్డి న్యూరో హాస్పిటల్లో శనివారం పదోతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి అనేది విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అన్నారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ప్రేమ, మార్గనిర్దేశం వారికి మానసిక బలాన్ని అందిస్తుందన్నారు. వారిని చదవాలని అదే పనిగా ఒత్తిడి చేయకూడదన్నారు. వారి బలహీనతలను అర్థం చేసుకుని, ధైర్యం నూరిపోసేలా ప్రవర్తించాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయాందోళనకు గురైతే 93900 44031 నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా మాట్లాడవచ్చన్నారు.

టూటౌన్ సీఐగా శివగణేష్

కంబాలచెరువు: రాజమహేంద్రవరం రెండో పట్టణ సీఐగా పి.శివగణేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనపర్తి సీఐగా పనిచేసిన ఆయన కాకినాడకు వీఆర్‌లోకి వెళ్లారు. ఆయనను టూటౌన్‌కు బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

దుర్గంధం లేని టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్, కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగం, దుర్గంధం లేని టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రొఫెషనల్ టీమ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను అత్యంత సమర్థంగా నిర్వహించడం కోసం అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రకృతి వనరులను సంరక్షించే దిశగా, తక్కువ నీటి వినియోగం, వాసన లేని టాయిలెట్లను ఏర్పాటు చేసే ప్రాజెక్ట్‌ను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్నామన్నారు. దీనిపై కంపెనీ ప్రతినిధులతో సమగ్రంగా చర్చించామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతి వనరులను కాపాడడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. సమావేశంలో ఆర్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని వ్యక్తి మృతి

కంబాలచెరువు: ఆస్తి తగాదాల నేపథ్యంలో ఒంటికి నిప్పంటించుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆల్కాట్ గార్డెన్స్ కొండావారి వీధికి చెందిన దొమ్మేటి సాయిశ్రీనివాస్ (45)కు ఏడాది క్రితం భార్య చనిపోయింది. అప్పటి నుంచి అతను ఒంటరిగా జీవిస్తున్నాడు. కాగా.. సాయి శ్రీనివాస్‌కు, అతడి అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. వీటి కారణంగా మనస్తాపం చెంది, పెట్రోల్ బంక్‌కు వెళ్లి పెట్రోల్ కొనుక్కుని ఇంటికి తెచ్చుకున్నాడు. దానిని శరీరంపై వేసుకుని నిప్పంటించుకున్నాడు. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం వచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

కంబాలచెరువు: పరిశుభ్రత అందరి బాధ్యత అని వక్తలు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగిది. విద్యార్థులు పోస్టర్, స్లోగన్ ప్రదర్శన చేసి, తరగతి గదులతో పాటు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అలాగే డాక్టర్ మల్లిఖార్జున, డాక్టర్ ఇసుబ్ భాషా, రవితేజ,. మురళీకృష్ణ, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లతో కలిసి కొంతమూరు, గాడాల గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 15 పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

- క్వారీ సెంటర్ రైతుబజార్‌లో నగరపాలకసంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నేతృత్వంలో పర్యావరణ పరిరక్షణపై వీధి నాటిక కళాజాతా ప్రదర్శించారు. ఎస్టేట్ అధికారి ఎస్.రోజియా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

కడియం: జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధానికి పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు.

= దుళ్లలో ప్లాస్టిక్ నిషేధానికి తోడ్పడాలని సర్పంచ్ కొండపల్లి పట్టియ్య కోరారు. ఈ మేరకు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, యానిమేటర్లు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



డీఎంహెచ్‌వో కార్యాలయంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు



జేగురుపాడులో ర్యాలీ చేస్తున్న స్టాలిన్ తదితరులు

సినిమాలు

శ్యామల	దిల్ రుబా
సూర్యమినీ	మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్	దిల్ రుబా
స్వామి	కోర్ట్
శివజ్యోతి	ఆఫీసర్ ఆన్ డ్యూటీ
అనుశ్రీ	శబ్దం
రాజా	అగత్యా
ఊర్వశి	తండేల్
మేనక	1000 వాలా, సంక్రాంతికి వస్తున్నాం
రంభ	మజాకా
కుమారి	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	యుగానికి ఒక్కడు
అశోక	చావా
నామవరం	
వీఎస్ మహల్	దిల్‌రుబా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	చావా, కోర్ట్
కడియం	
వెంకటసూర్య	కోర్ట్